నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, బుధవారం 19 జూన్ 2024 | SIDDIPET

గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి

అంజాగౌడ్ (ఫైల్)

మిరుదొడ్డి, జూన్ 18: గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన మిరుదొడ్డి మండలం ధర్మారంలో చోటుచేసుకుంది. బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అతికం అంజాగౌడ్ (53) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి ఆటోను బయటకు తీస్తున్న క్రమంలో ఛాతిలో నొప్పి వస్తుందని తెలుపడంతో కుటుంబీకులు అతడిని చికిత్స కోసం సిద్దిపేటకు తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

యోగా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట, జూన్ 18: సిద్దిపేట ప్రభుత్వ బాలికల కళాశాల స్టేడియంలో ఈనెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం పోస్టర్‌ను ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, కలెక్టర్ మనుచౌదరి మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. యోగా సంస్థలు, సేవా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అధికారులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొని, దశాబ్ది యోగా ఉత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ప్రతినిధులు తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, తోట సతీశ్, అయిత అంజయ్య, కల్లేపల్లి శ్రీనివాస్, తోట సంధ్య, హరిప్రసాద్, శశికిరణ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, కలెక్టర్ మనుచౌదరి, తదితరులు

గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కాకి లెక్కలతో కాలయాపన

- ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ సర్కారు
- కేసీఆర్ ప్రభుత్వంపై బురదజల్లుతూ అబద్ధపు ప్రచారం
- ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి
- విత్తనాలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- నాలుగు నెలల్లో రూ.40వేల కోట్ల అప్పులు తెచ్చిన రేవంత్ సర్కారు
- మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 18: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడిచినా ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తూ కేసీఆర్ ప్రభుత్వంపై కాకిలెక్కలు చెబుతూ అబద్ధపు ప్రచారం చేస్తుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీపై ఆంక్షలు విధించడం దుర్మార్గమని, ప్రతి రైతుకూ రుణమాఫీకి అవకాశం కల్పించాలన్నారు. రుణమాఫీకి రూ.35వేల కోట్లు ఖర్చవుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుతున్నదని, అంత అవసరం లేదని అవగాహన, లెక్కలు లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. దీంతో ప్రజలు అయోమయంలో ఉంటున్నారని, ప్రజల కోసం మాట్లాడే వాటిపై స్పష్టత ఉండాలన్నారు. రైతులకు విత్తనాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంలో నీట్ పేపర్ లీక్ అయితే కాంగ్రెస్ ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యూనిట్ కరెంట్‌ను రూ.3.90పైసలకు కొనుగోలు చేస్తే ప్రభుత్వం రూ.12కు కొనుగోలు చేస్తుందన్నారు. మార్పు అంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. కరెంట్‌పై రూ.6 వేల కోట్ల ఫ్రాడ్ జరిగిందని మాట్లాడమంతా తప్పేనని, ఒడిసా నుంచి కొనుగోలు చేసి తెలంగాణ తీసుకొచ్చే క్రమంలో చార్జీలు పడుతాయని నేషనల్ గ్రిడ్ అనుసంధానంలో ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం ఆరు నెలలుగా బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నదని ప్రతాప్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గొర్రెల పంపిణీలో రూ.700 కోట్ల స్కాం జరిగిందని మాట్లాడడంతో వాస్తవాలు లేవని, లబ్ధిదారులను అడిగితే అంత బయట పడుతుందన్నారు. దేశంలోనే రైతులకు 24గంటల కరెంట్, ఫార్మా అభివృద్ధి, వ్యవసాయం, పరిశ్రమల ఏర్పాటులో అగ్రస్థానంలో నిలిపామన్నారు. ప్రజల నడ్డి విరిచేలా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. నాలుగు నెలల్లో రూ.40 వేల కోట్ల అప్పులు తెచ్చి ప్రభుత్వం ఏమీ చేసిందన్నారు. బీఆర్ఎస్ రూ.3.60లక్షల కోట్లతో కాళేశ్వరం నిర్మాణం, పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులు, హైదరాబాద్‌కు తాగునీటిని సరఫరా చేసిందన్నారు. ఆంధ్రలో చంద్రబాబు హామీలను అమలు చేస్తున్నరని, రేవంత్‌రెడ్డి కూడా అమలు చేయాల న్నారు. సమవేశంలో మల్లేశం, నవాజ్, కృష్ణారెడ్డి, బాలేశ్, మెట్టయ్య, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, రవీందర్, ఎల్లయ్య, విరాసత్ అలీ, నర్సింగరావు, కిష్టయ్య, యాదగిరి, అజిత్, ఉమార్, నరేందర్, అహ్మద్ ఉన్నారు.

అవ్వాతాతల ఎదురుచూపు

రెండు నెలలుగా పింఛన్లు చెల్లించని రేవంత్ సర్కారు

- అక్కడక్కడ ఏప్రిల్ నెల పింఛన్లు పంపిణీ
- పింఛన్ కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 4,69,575 ఆసరా పింఛన్‌దారులు
- కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతినెలా అందిన పింఛన్
- కాంగ్రెస్ ప్రభుత్వంలో లబ్ధిదారులకు తప్పనితిప్పలు
- రేవంత్ ప్రభుత్వంలో అన్నీ ఎదురుచూపులే..
- తక్షణమే బకాయిలు చెల్లించి పింఛన్‌దారులను ఆదుకోవాలి

సిద్దిపేట, జూన్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి): పింఛన్ డబ్బుల కోసం అవ్వాతాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు. పింఛన్ ఎప్పుడు వస్తుంది అని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సుమారుగా 4,69,575 మంది ఆసరా పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి నెలనెలా డబ్బులు రాకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యక్తిగత అవసరాలతో పాటు, మందులు ఇతర వాటిని కొనుక్కోవడానికి వారిచేతిలో డబ్బులు లేక నానాఅవస్థలు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నెలనెలా డబ్బులను నిర్ణీత గడువులో నేరుగా పింఛన్‌దారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేసే వారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నెలనెలా సరిగా పింఛన్ డబ్బులు పడడం లేదు. గతంలో ఒక నెల డబ్బులు పూర్తిగా వేయలేదు. ఏప్రిల్, మే పింఛన్ డబ్బులు రావాల్సి ఉండగా, ఇటీవల కొన్ని ప్రాంతాల్లో ఏప్రిల్ డబ్బులు వచ్చాయి. మే డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. జూన్ చివరి వరకు వచ్చింది. ఇప్పటి వరకు మే డబ్బులు పత్తాలేదు. జూన్ మాసం గడిస్తే రెండు నెలల పింఛన్ డబ్బులు వేయాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్ డబ్బులు పెంచుతామని చెప్పిన ప్రభుత్వం ఉన్న పింఛన్ డబ్బులను సరిగా వేయడం లేదని పింఛన్‌దారులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆసరా పింఛన్ల కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రతినెలా రూ.102.22 కోట్ల లబ్ధిదారుల వ్యక్తి గత బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. ఇందులో దివ్యాంగులు 37,785 మంది ఉన్నారు. వీరి కోసం ప్రతి నెలా ఒక్కొక్కరికీ రూ. 4,016 చొప్పున రూ. 15,17,44,560 జమ చేసింది. మిగతా వర్గాల వారు 4,31,790 మందికి మొత్తం రూ. 87,04,88,640లను ప్రతినెలా ఇబ్బంది లేకుండా చెల్లించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంతో పింఛన్‌దారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ అలవికానీ హామీలు ఇచ్చి గద్దెనెక్కింది. అధికారంలోకి వచ్చాక అన్నీ మరిచిపోయింది. తాము అధికారంలోకి రాగానే వృద్ధుల పింఛన్లను రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ.6వేలు ఇస్తామని చెప్పి మొఖం చాటేసింది. నెలనెలా పింఛన్ డబ్బులు సరిగా ఇవ్వని ప్రభుత్వం కొత్తగా పింఛన్ డబ్బులు పెంచి ఇస్తదన్న నమ్మకం లేదని పింఛన్‌దారులు చెబుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క మాట కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. ఆరు నెలల అయినా ఈ ప్రభుత్వం హామీల అమలు దిశగా ఆలోచన చేయడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరునెలలకు ఒక్కో పింఛన్‌దారుడికి అదనంగా రూ. 12 వేలు చెల్లించాలని ఆ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఉన్న పింఛన్లు సక్కగా ఇస్తే మాకు అదే చాలని పింఛన్‌దారులు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని ఎదురుచూపులే అవుతున్నాయి. ఆసరా పింఛన్ లబ్ధిదారులు, రైతులు, కొన్ని శాఖలకు సంబంధించిన ఉద్యోగులకు ఎదురుచూపులే అవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతినెలా రంఫన్‌గా ఆసరా పింఛన్లు పడుతుండే.. సెల్‌ఫోన్‌కు మెసేజ్ రాగానే నేరుగా బ్యాంకుకెళ్లి డబ్బులు తెచ్చుకునే వారు. అప్పుడు ఎలాంటి రందీ లేదు. పింఛన్ రాదనే భయమూ లేదు.

పింఛన్ ఇవ్వడానికి అపసోపాలు పడుతున్న ప్రభుత్వం

ఉమ్మడి జిల్లాలోని పింఛన్‌దారులు డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతవరకు పింఛన్ డబ్బులు బ్యాంక్ ఖాతాలో పడకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల వారికి ఎదురు చూపులే మిగిలాయి. పింఛన్ డబ్బులు వస్తే వారికి కావాల్సిన వస్తువులు, మందులు తదితర అవసరాలు తీర్చుకుంటారు. పింఛన్‌దారులకు నెలనెలా పింఛన్ రాకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ డబ్బులను పెంచుతామని గొప్పలు చెప్పింది. ఉన్న పింఛన్లు ఇవ్వడానికే ఈ ప్రభుత్వం ఆపసోపాలు పడుతున్నది. తక్షణమే బకాయి ఉన్న పింఛన్ డబ్బులు చెల్లించి పింఛన్‌దారులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– తన్నీరు హరీశ్‌రావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే

రూ.200 పింఛన్ రూ.2000 చేసిన కేసీఆర్

సమైక్య రాష్ట్రంలో చాలీచాలని పింఛన్లు కొన్ని వర్గాలకే అందించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, బీడీ కార్మికులతోపాటుగా ఎయిడ్స్, పైలేరియా, డయాలసిస్ బాధితులను కూడా అక్కున చేర్చుకుని కేసీఆర్ ప్రభుత్వం పింఛన్లు అందించింది. నాటి సమైక్య రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు కేవ లం రెండు వందలు, దివ్యాంగులకు ఐదు వందల పింఛన్లు మాత్రమే ఇచ్చారు. కేసీఆర్ నెలనెలా దివ్యాంగులకు రూ.4వేలు, మిగి తా వర్గాలకు 2వేలు అందించారు. సిద్దిపేట జిల్లాలో 1,91,185 మంది లబ్ధిదారులకు రూ.41,39,02,960, మెదక్ జిల్లాలో 1,16,728 మంది లబ్ధిదారులకు రూ. 25,24,39,648, సంగారెడ్డి జిల్లాలో 1,61,662 మంది లబ్ధిదారులకు రూ. 35,58,90,592 ప్రతినెలా చెల్లించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో అన్ని రకాల పింఛన్లు కలుపుకొని మొత్తం 4,69,575 మంది ఉన్నారు. వీరిలో 1,64,405 మంది వృద్ధులు, 1,74, 940 మంది వితంతువులు, 37,785 మంది దివ్యాంగులు, 4,814 మంది గీత కార్మికులు, 3,525 చేనేత కార్మికులు, 3,107 మంది హెచ్ఐవీ బాధితులు, 3,448 మంది పైలేరియా వ్యాధిగ్రస్తులు, 339 మంది డయాల సిస్ పేషెంట్లు, 300 మంది బీడీ టేకేదారులు, 41,608 మంది బీడీ కార్మికులు, 15,304 మంది ఒంటరి మహిళలు ఉన్నారు. వారందరికీ బీఆర్ఎస్ ప్రభుత్వం నెలనెలా ఒకటో తేదీనే పింఛన్లు అందజేసింది.

అమాత్యులారా.. జర ఆలకించండి

- మెట్ట ప్రాంతమైన నన్ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తారని ఆశపడుతున్నా..
- ఇద్దరు మంత్రులతో నాకు కొండంత బలం వచ్చింది..
- మెడికల్ కళాశాల, రైలుకూత వినాలనే ఆశతో ఉన్నా..
- ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతారని నమ్ముతున్నా..
- కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు 'హుస్నాబాద్ నియోజకవర్గం' మొర

హుస్నాబాద్ పట్టణ వ్యూ

హుస్నాబాద్, జూన్ 18: అమాత్యులారా నేను హుస్నాబాద్ నియోజకవర్గాన్ని... మెట్ట ప్రాంతమైన నన్ను ఉమ్మడి రాష్ట్రంలో వెలివేసినట్లు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్లక్ష్యానికి గురయ్యాను. తాగు, సాగునీటి కోసం తండ్లాడాను.. పశువులకు గడ్డి కూడా దొరకని పరిస్థితుల్లో నా ప్రజలు, పశువులు బతుకెల్లదీసిండ్రు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న నన్ను గడిచిన పదేండ్లలో అభివృద్ధి దశలోకి తీసుకెళ్తున్న తరుణంలో సర్కారు మారిపోయింది. అయినా నాకు ఇద్దరు మంత్రులు వచ్చారనే ధీమా పెరిగింది. ఇక అభివృద్ధికి కొదవుండదని అనుకుంటున్నా. కేంద్ర మంత్రిగా బండి సంజయ్, రాష్ట్ర మంత్రిగా పొన్నం ప్రభాకర్ అయినప్పటి నుంచి నాలో ధైర్యం రెట్టింపయ్యింది. ఇక నా అభివృద్ధికి అడ్డు ఉండదని సంబురపడుతున్నా. గడిచిన యాభై ఏండ్లలో ఎన్నడూ లేని విధంగా ఇద్దరు మంత్రులు నాకు ఉండడం ఇదే మొదటిసారి. నాకు కేంద్ర బిందువైన హుస్నాబాద్ పట్టణం మరో సిద్దిపేట, మరో గజ్వేల్, మరో సిరిసిల్ల, మరో కరీంనగర్ పట్టణంగా తీర్చిదిద్దుతారనే ఆశలో ఉన్నాను. నా పరిధిలోని అన్ని మండలాలు, అన్ని గ్రామాల ప్రజలు సుభిక్షంగా ఉండేలా సాగు, తాగునీరు తెస్తారని, సకల సౌకర్యాలు కల్పిస్తారనే ఆశతో ఉన్నా. ఇన్ని ఆశలు పెట్టుకున్న నన్ను ఈ ఐదేండ్లలో ఎలా అభివృద్ధి చేస్తారనే ఉత్కంఠతో ఎదురు చూస్తున్నా..

ఎన్నికల సమయంలో పోటాపోటీ హామీలు

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో హుస్నాబాద్ నియోజకవర్గమైన నా వద్దకు వచ్చి బండి సంజయ్, పొన్నం ప్రభాకర్ పోటాపోటీ హామీలు ఇచ్చారు. ఎంపీగా గెలిస్తే ఊహించని అభివృద్ధి చేస్తానని బండి సంజయ్, ఎమ్మెల్యేగా గెలిపిస్తే హుస్నాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బాండ్‌పేపర్ రాసిచ్చి హామీ ఇచ్చిన పొన్నం ప్రభాకర్ తమ మాటను నిలుపుకొంటారని ఆశిస్తున్నా. ఎన్నికల సమయంలో పోటీపడి హామీలిచ్చి కేంద్ర, రాష్ట్ర మంత్రులైన మీరిద్దరు అంతేస్థాయిలో పోటీపడి నియోజకవర్గానికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తారనే గంపెడాశతో ఉన్నాను. ఎన్నికల ప్పుడు ఉన్న జోరు, పోటీతత్వం పదవులు పొందాక కూడా ఉంటుందా... లేక స్వలాభమే ధ్యేయంగా పనిచేస్తారా అనే అనుమానాలు నా పరిధిలోని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మీరిద్దరూ స్థానికులు కాకపోయినా నేను, నా ప్రజలు ఆదరించి అక్కును చేర్చుకున్నాం. ఆదరించిన నన్ను ఆదుకుంటారో... ఆదమరుస్తారో... చూస్తా. మీరిచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తారనే నమ్మకంతో ఉన్నాను.

రైలు కూత వినిపిస్తారా...?

హుస్నాబాద్ నియోజకవర్గమైన నేను ఎన్నో దశాబ్దాలుగా రైలు కూత కోసం ఎదురు చూస్తున్నా. కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్ మీరైనా... నాకు రైలు కూత వినిపిస్తారా? 2019ఎన్నికల్లో నా పరిధి నుంచి రైలు మార్గం వేయిస్తానని హామీ ఇవ్వడంతో ఎంతో సంతోషించాను. కానీ, అనంతరం నన్ను విస్మరించారు. మళ్లీ 2024 ఎన్నికల్లో నా ప్రజలతో పాటు నాతోటి అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రజలు మిమ్మల్ని భారీ మెజార్టీతో గెలిపించారు. ఇప్పటికైనా నా ప్రజల కల నెరవేరుస్తారా... జనగామ నుంచి హుస్నాబాద్ మీదుగా కరీంనగర్ వరకు రైలు మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. కేంద్రమంత్రి హోదాలో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుడతారని భావిస్తున్నా. అంతకుముందు ఉన్న ఎంపీ ప్రయత్నమో లేక మీకృషి కావచ్చు గానీ ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట వరకు హైవే పనులు పూర్తి కావస్తున్నాయి. రవాణా సౌకర్యం మెరుగుపడుతున్నందున నా ప్రాంతానికి పెద్దసంఖ్యలో పరిశ్రమలను మంజూరు చేయించి యువతకు ఉపాధి కల్పిస్తారని ఆశిస్తున్నా. నవోదయ పాఠశాల లేదా సైనిక్ స్కూల్ మంజూరు చేస్తే నా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తెచ్చి గ్రామాల అభివృద్ధికి దోహదపడుతారని ఆశపడుతున్నా. నా మనవిని ఆలకిస్తారా...?

యాసంగికైనా గౌరవెల్లి నీళ్లిస్తారా... మెడికల్ కళాశాల సంగతేంటీ?

నా మెట్ట రైతులకు వరప్రదాయిన గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కాలువలు తీసి పొలాలకు నీళ్లివ్వడమే తరువాయి. రాష్ట్ర మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్...వచ్చే యాసంగి వరకైనా కాలువల నిర్మాణం పూర్తి చేసి నీళ్లిస్తారా? లేక నిర్లక్ష్యం చేసినా రైతుల అన్యాయం చేస్తారా... హుస్నాబాద్ నుంచి గెలిచి మొట్టమొదటి మంత్రిగా నియామకమైన మీపై ఎన్నో ఆశలతో ఉన్నా. ఎన్నికల సమయంలో నాకు ఎన్నో హామీలు ఇచ్చారు. వాటిని నెరవేరుస్తారని ఆశిస్తున్నా. ప్రియాంకగాంధీచే హుస్నాబాద్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇప్పించారు. కానీ, ఇప్పటి వరకు దాని ఊసు కనిపించడం లేదు. హుస్నాబాద్‌లో ఉన్న 100 పడకల దవాఖానను 250 పడకల దవాఖానగా మారుస్తామని చెప్పి అందుకు తగిన ప్రయత్నాలు మాత్రం చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. హుస్నాబాద్ చుట్టూ రింగ్‌రోడ్డు వేస్తామన్నారు. కొత్తపల్లి నుంచి జనగామ వరకు హైవే రోడ్డు నిర్మాణం చేస్తానన్నారు. నన్ను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తమరు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారనే నమ్మకంతో ఉన్నా. నా నమ్మకాన్ని వమ్ము చేయరనే ధీమాతో ఉన్నా. ఏం చేస్తారో మరి.?

ఒక వర్గానికి కొమ్ముకాస్తే సహించం

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, జూన్ 18: మెదక్‌లో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పోలీసులు ఒకవర్గంపైనే చర్యలు తీసుకోవడం మంచిది కాదని, చట్టం ముందు అందరూ సమానులేనని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బక్రీద్‌కు ముందురోజు మెదక్ పట్టణంలో జరిగిన ఘటనలో అరెస్ట్ అయి మెదక్ సబ్ జైలులో ఉన్న ఒకవర్గం వారిని బీజేపీ నాయకులు ములాఖత్ ద్వారా మంగళవారం కలిశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎంపీ రఘునందన్ మాట్లాడుతూ.. మెదక్‌లో జరిగిన ఘటనలో నిర్లక్ష్యం వహించిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉదయం 11గంటలకు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసి అలర్ట్ చేసినా పోలీసులు సరిగ్గా స్పందించలేదన్నారు. అచేతనావస్థలో పోలీస్ శాఖ ఉండిపోయిందని విమర్శించారు. ఈ ఘటనలో పోలీసులు ఒకవర్గానికి కొమ్ము కాస్తే సహించేది లేదన్నారు. చట్ట ప్రకారం, న్యాయ ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీస్‌శాఖకు ఎంపీ సూచించారు. అనంతరం మెదక్ ఎస్పీని కలిసి జరిగిన ఘటనలపై ఫిర్యాదు చేశారు.

మెదక్ ఘటనలో 27 మంది అరెస్ట్

మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి

- మెదక్ ఎస్పీ డాక్టర్ ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, జూన్ 18 : మెదక్ పట్టణంలో ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ అదుపులోకి వచ్చిందని, గొడవలకు కారణమైన 27 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి మంగళవారం తెలిపారు. ఇతర జిల్లాల నుంచి పోలీస్ బలగాలను రప్పించి పరిస్థితి అదుపులోకి తెచ్చినట్లు తెలిపారు. సోషల్‌మీడియాలో వచ్చే వదంతులను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే బాధ్యులను ఎట్టి పరిస్థితుల్లో వదలమన్నారు. మెదక్ గొడవలపై సమగ్ర విచారణ జరుగుతోందని, గొడవలకు కారణమైన వారిని విడిచిపెట్టేది లేదని ఎస్పీ తెలిపారు.

కోటి విలువైన ఆల్ఫాజోలం పట్టివేత

- తయారీ కేంద్రంపై టీజీ న్యాబ్, పోలీసుల దాడులు
- కొత్తపల్లిలో వివరాలు వెల్లడించిన సంగారెడ్డి ఎస్పీ రూపేశ్

కొత్తపల్లిలో వివరాలు వెల్లడిస్తున్న సంగారెడ్డి ఎస్పీ రూపేశ్

గుమ్మడిదల, జూన్ 18: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామశివారులో సర్వేనంబర్ 174/28 స్థలంలోని కోళ్ల ఫారంలో గుట్టుచప్పుడు కాకుండా తయారు చేస్తున్న ఆల్ఫాజోలాన్ని టీజీ న్యాబ్ అధికారులు, పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న 2.6 కిలోల ఆల్ఫాజోలం విలువ సుమారు రూ.కోటి ఉంటుందని పోలీసులు తెలిపారు. నలుగురు వ్యక్తులు ఈ తతంగాన్ని నడిపిస్తుండగా, ఇద్దరిని పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్ మంగళవారం ఘటనా స్థలంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. మంగళవారం టీజీ న్యాబ్, సంగారెడ్డి జిల్లా పోలీసులు సంయుక్తంగా కొత్తపల్లి గ్రామశివారులోని 174/28 స్థలంలోని కోళ్లఫారంలో తయారీ కేంద్రంలో రూ. కోటి విలువైన ఆల్ఫాజోలం, వాటి తయారీ ముడి పదార్థాలను పట్టుకున్నారు. దీంతోపాటు యంత్రాలను సీజ్ చేశారు. నిందితులు గోసుకొండ అంజిరెడ్డి, ప్రభాకర్ గౌడ్, క్యాసారం రాకేశ్ ముగ్గురు కలిసి అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని కొత్తపల్లిలో వ్యవసాయ భూమిని లీజుకు తీసుకున్నారు. అందులో కోళ్ల ఫారం నడుపుతూ గుట్టుచప్పుడు కాకుండా బాలానగర్ నుంచి ముడి పదార్థాలను తీసుకొచ్చి కెమిస్ట్ క్యాసారం రాకేశ్ సహాయంతో ఆల్ఫాజోలం తయారు చేస్తున్నారు. తయారు చేసిన ఆల్ఫాజోలాన్ని ప్రభాకర్‌గౌడ్ లోకల్ కల్లు దుకాణాల్లో అమ్మి డబ్బులు సంపాదించేవాడని ఎస్పీ రూపేశ్ మీడియాకు వెల్లడించారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని జిల్లాను డ్రగ్స్ ఫ్రీగా మార్చడానికి ప్రజలు సహకరించాలని ఎస్పీ రూపేశ్ కోరారు. ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. ఎక్కడైనా ఇలాంటి మత్తు పదార్థాలు తయారు చేస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ రూపేశ్ కోరారు. సమావేశంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, టీజీ న్యాబ్ డీఎస్పీ శ్రీధర్, సంతోష్, సీఐ సుధీర్‌కుమార్, ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భవనాల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- బాలరక్ష, వృద్ధాశ్రమ భవనాల పరిశీలన

సంగారెడ్డి బాల సదనంలో చిన్నారుల బాగోగులపై ఆరా తీస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 18: బా